# పాపం!

శ్రీమతి ఆర్. వసుంధర

లక్ష్మీకాలనీ అనగానే 'ఆ గులాబీరంగు పెద్ద మేడ ఉంటుందే, అదేగదూ' అంటారు ప్రతి వాళ్ళూ. మా కాలనీలో చిన్నవీ షుమారుపాటివీ అయిన యాభైయిళ్ల మధ్య దేవప్రియా వాళ్ల దొక్కటే పెద్దమేడ. అధునాతనమైన డిజైనులో డాబుగా కన్పిస్తుంది. లోపల గదులన్నీ ఆధునికంగానేవున్నా, దేవప్రియ డాన్సు చెయ్యడానికని కట్టించిన పెద్ద హాలు ప్రత్యేకంగా చెప్పదగినది. అందమైన నమూనాలో పాలరాతి తాపడం చేసిన నేలతో చాలా బాగుంటుంది. అప్పుడప్పుడు వాళ్లనాన్నగారు—డాక్టర్ శరభయ్యగారు—తన క్లబ్బు స్నేహితులైన వాళ్లను పిలిచి విందుచేసినప్పుడు దేవప్రియచేత డాన్సు చేయిస్తుంటారు.

కాలేజిలో కూడా ఒకసారి డాన్సు చేసింది ఒక ఫంక్షన్‌లో. పదహారు సంవత్సరాలు నిండినా అతి కోమలంగా ఉండటాన చిన్నపిల్లలాగా కన్పించే దేవప్రియ డాన్సు చేస్తుంటే చూడ ముచ్చటగా ఉంటుంది.

దేవప్రియ అంటే కాలేజిలో అందరికీ—లెక్చరర్లకీ, స్టూడెంట్సుకీ మాత్రమేకాదు, ప్యూన్సుకు కూడా—అభిమానం. డబ్బూ, అందమూ, తెలివీ—మనిషి కోరుకునేవన్నీ—వుండి సౌమ్యస్వభావం కల వ్యక్తి అందరి సదభిప్రాయమూ సులువుగా పొంద వచ్చును. కాని ప్రియ యెడల కలిగేది ఉత్త సదభిప్రాయం మాత్రమేకాదు. అది ఆత్మీయమైన అభిమానం. ఆ అమ్మాయి ముఖంలో ప్రపంచంలోని బాధ లన్నిటినీ ఆకళించుకున్నట్టి ఒక ప్రశాంతత ఉన్నది. కాని మితభాషిణి అయిన ప్రియ ఎవరివైపు చూచినా, ప్రేమపూర్ణమైన ప్రసన్నతా, స్నేహపూర్వకమైన చిరునవ్వూ ముందుగా పలుకరించేవి.

ప్రియ స్వభావం గురించి మా కందరికీ బాగా తెలియడానికి అవకాశం కలిగించింది మొదటి ఏడాదిలో బియస్సీ స్టూడెంట్సు అందరం కలసి వెళ్లిన ఒక బాటనీ ఎక్స్‌కర్షన్. బెంగుళూరులో గడిపిన ఆ మూడు రోజుల్లోనూ యితరుల ఎడల సానుభూతితో స్పందించే ఆ అమ్మాయి గుణం అందర్నీ ఆకర్షించింది. గ్రుడ్డి ముసలివాడిని రోడ్డు దాటించాలన్నా, క్రిందపడి ఏడుస్తున్న చీమిడికారే మురికి పిల్లని లేవనెత్తి ఓదార్చాలన్నా అందరికంటే ముందుగా వుండేది. ఒక ముసలిబిచ్చగత్తెను చూచి జాలిపడి మా అందరి దగ్గరా పైసలు తనే యిప్పించుకొని తానూ కొంత చేర్చి ఆ ముసలిదాని కిచ్చిన ప్రియను మనసుల్లోనే అభినందించుకున్నాము....ఒక రోజున అందరూ సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. నాకు బాగా జ్వరం వచ్చింది. అందరికీ సినిమా చూడాలనుంది. నన్ను ఒంటరిగా ఒదిలివెళ్లటం ఎట్లాగని అనుకుంటుండగానే 'నాకు సినిమాలంటే ఎక్కువ ఆసక్తిలేదు. విమల దగ్గర నేనుంటాను. మీరందరూ వెళ్లండి' అని నాతో వుండిపోయిన ప్రియను నేను మరచిపోగలనా! ఆ ఎక్స్‌కర్షన్‌కు రాకుంటే ప్రియ గురించి మాకు అంతగా తెలిసివుండేదికాదు. ఎందుకంటే కాలేజిలోవున్న సమయం తప్పించి బయట ప్రియకూ మాకూ ఏవిధమైన సంబంధం ఉండేది కాదు. తొమ్మిదీయాభైకి టంచనుగా కాలేజిలో కారు దిగుతుంది. నాలుగ్గంటలకు కాలేజి విడిచే వేళకు తనను తీసుకువెళ్లడానికి కారు సిద్ధంగా వుంటుంది. అదీ గాకుండా సహజంగా ఆ అమ్మాయి మితభాషిణి. వాళ్లుండే కాలనీలోనే యింకో ముగ్గురం ఆ క్లాసుఅమ్మాయిలంవున్నాకూడా మేము కలవడానికి అవకాశంలేదు. వాళ్లమ్మగారు యిలాంటి అనుబంధాల్ని ప్రోత్సహించేవారుకాదు. ఆమె ఒకరిం

టికి వెళ్లటంగానీ ఒకరిని పిలవడంగానీ వుండేది గాదు. ఐశ్వర్యగర్వంఅని కాలనీలో వాళ్ల అనుకునే వాళ్లు. డాక్టరు శరభయ్యగారు రోజులో చాలాభాగం క్లబ్బులోనే గడిపేవారు. ఆవిడమాదిరి 'ఒంటి పిల్లి రాకాసి' కాదు. వాళ్లయిల్లు ఆయన స్నేహితులకు తప్పించి అందుబాటులో ఉండేదికాదు. మూడేళ్లక్రితం గవర్నమెంటు డాక్టరుగా రిటైరయిన శరభయ్యగారు ఎందుకో యిక్కడ యిల్లుకట్టించుకుని స్థిరపడ్డారు. ఎక్కడినుండో వచ్చినవాళ్లు కావడంవలన వాళ్ల గురించిన విశేషాలు అంతగా బయటకు రాలేదు. డాక్టరుగారు మిలటరీలో వున్నప్పుడు ఒక నర్సుతో చనవుగా వుండటం, ఆవిడ బంధువులు ధనవంతుడైన ఆయన్ను బెదిరించి ఆవిడ మెళ్లో తాళికట్టించటం జరిగిందనీ, వాళ్లకు పిల్లలు లేనందున డాక్టరుగారి స్నేహితుల తాలూకు పిల్లనుతెచ్చి పెంచుకున్నారనీ ఎవరి ద్వారానో కాలనీలో తెలిసింది. అతను డాక్టరుగా ఉన్నప్పుడు అవసరానవసరాలు ఎంచకుండా ఆపరేషన్ అంటూ అయినదానికీ కానిదానికీ మనుషుల్ని పరపరా కోసి పడేసేవాడనీ, అది ఆయనకు సరదాఅనీ, కారు నడుపుతున్నప్పుడు దారిలో అడ్డం వచ్చిన కోళ్ల మీదుగా కుక్కలమీదుగా కారు పోనిచ్చేస్తాడనీ, ఆమె అతన్ని మించిన క్రూరాత్మురాలనీ అంటారు. వాళ్ల గుణగణాలు బేరీజు వెయ్యగలంత పరిచయం మా కాలనీలో ఎవరికీలేదు. మొత్తానికి వాళ్ల గురించి చాలా అపోహలున్నాయి. వాళ్లు ఎవరితోనూ కలవరు గనుక అవి తొలగిపోవడానికి అవకాశమూ లేదు.

చిమ దూర సందివ్వని ఆ కుటుంబ వాతావరణంలోనికి నేను ప్రవేశించడం ఎలా జరిగిందో నాకే అర్థంకాదు. వాళ్లమ్మగారికి నాలో ఒక ప్రత్యేక లక్షణం కనిపించి ఆకర్షించిందా అనుకోవటానికి నేను అతి సామాన్యురాలిని. చెప్పుకోదగ్గతెలివిగాని అందంగాని లేవు. మాది పేద కుటుంబమనే అనాలి. ఒకసారి ఆమె నన్ను పిలిపించింది. అదే నేను వాళ్లింట్లో కాలుపెట్టిన మొదటిరోజు. ఆమె పొట్టి మనిషి. కొంచెం లావుగా నల్లగా మోటుగా ఉంటుంది. కాని శుభ్రమైనబట్టలు ధరించటంవలననూ, ఐశ్వర్యంవలన వచ్చిన హుందాతనంవలననూ ఆ లోపాలు కన్పించవు. ఏవో రెండు ప్రశ్నలు వేశాక రోజూ నన్ను దేవప్రియకు తోడుగా కాలేజికి వాళ్ల కారులోనే వస్తూ పోతూ వుండమనీ కాలేజిలో ప్రియ వెంటనే ఉండమనీ చెప్పింది. నాకు ఆశ్చర్యం కలిగింది యీ ఆదరానికి. మా కాలనీకి కాలేజీ చాలా దూరం అయినందున యీ అవకాశానికి సంతోషంగా ఒప్పుకున్నాను.

బయట కన్పించే దేవప్రియకూ యింట్లో మెసలే దేవప్రియకూ చాలా వ్యత్యాసం కనిపించింది నాకు. ఈ ప్రియ తనలోనికి తాను ముడుచుకుపోయిన పువ్వులాంటిది అనుకున్నాను. ఈ ప్రియ మొహంలో ఒక అసహజమైన శూన్యత ఉన్నది. బయట కన్పించే ప్రశాంతతా, సౌమ్యతా, స్నేహశీలతా కనుపించవు....ఈ మార్పును నాకు చెబుతున్నట్టి సంఘటన ఒకటి జరిగింది ఒకనాడు. వాళ్లమ్మగారు కుట్టుమిషనుదగ్గర ఏవో బట్టలు కుడుతోంది. బట్టను సూదిక్రిందకు సర్దుతూండగా పొరపాటున సూది క్రిందకు దిగింది. గోరులోంచీ వేలులోంచీ క్రిందకు దిగి యీవలకు వచ్చేసింది. చూస్తుండగానే అంతా రెప్పపాటులో జరిగిపోయింది. 'అబ్బా' అని కేక వేసిందామె. ఆ దృశ్యం చూసి భయంవేసి 'అయ్యయ్యో' అని అరిచాను నేను. ప్రియ అంతా చూస్తూ కదలకుండా నిర్వికారంగా నిల్చున్నది.ఆమె సూదినుంచి వేలినిమెల్లగా విడిపించుకున్నది. ప్రియను కోపంగా చూస్తూ "నాకు గుచ్చుకున్నదని సంతోషిస్తూ నిలుచున్నావా?.....డెట్టాల్ తీసుకురా ఫో" అంటూ కసిరింది. వేలు గట్టిగా పట్టుకొని యింకా ఆవేశంలోనే నన్ను చూసి 'అది అలా మంచి దానిలా నటిస్తుందిగాని నిజానికి రాక్షసి. ఇంత జరుగుతూంటే నీకున్నమాత్రం అక్కర గూడా లేకుండా మొండి పిశాచిలాగా ఎట్లా నిలుచున్నదో చూశావుగదా' అన్నది. ఆమెమాటలూ ప్రియ ప్రవర్తనా రెండూ నాకు చాలా ఆశ్చర్యం కలిగించాయి. మేము కాలేజిలో ఎరిగిన దయామయి అయిన అమ్మాయేనా తాను! పైకి కన్పించే సామాన్యత వెనుక ఆ విచిత్ర కుటుంబంలో దాగివున్న సుడిగుండాలతోనూ, అసహనంతోనూ, ద్వేషం

తోనూ, క్రౌర్యంతోనూ నాకు కలిగిన ప్రథమ పరిచయం అది.

నేను వాళ్లింటికి వెళ్లటం ప్రారంభించాక కొన్నాళ్లకు వాళ్లమ్మగారోసారి అడిగారు— 'ప్రియ కాలేజీలో అబ్బాయిలతోగాని లెక్చరర్లతోగాని ఎక్కువ మాట్లాడుతుందా' అని. ఆమె అలా ఎందుకు అడుగుతుందో నాకు అర్థంకాలేదు. 'ప్రియయింట్లో ఎలా వుంటుందో కాలేజీలోనూ అలానే వుంటుందండీ. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడదు' అన్నాను. తన ప్రశ్న నా కర్థంకాలేదన్నట్లుగా మొఖం పెట్టిందామె. 'అదికాదు విమలా......... అహా......... ఎవరితోనైనా ఒక్కరితో ఎక్కువగా మాట్లాడుతుందా అని..... మన జాగ్రత్తలో మనం వుండాలి కదా....... ఎందుకైనా మంచిది అన్నది. ఆ నసుగుడంతా తెలియకపోయినా ప్రశ్నమాత్రం బాగానే బోధపడ్డదనుకున్నాను. 'ఆ.... మాట్లాడితే నాతోనే ఎక్కువగా మాట్లాడుతుందండీ. ఇంకెవరితోనూ మాట్లాడదు?' అన్నాను. ఆమె క్కోపం వచ్చింది. 'నీ సంగతికాదు......... మగవాళ్లతో.... అబ్బాయిలూ లెక్చరర్లూ వాళ్లతో' అన్నది ప్రతిమాటా నొక్కి పలుకుతూ. అప్పటికి నా మంద బుద్ధికి ఆమె ప్రశ్న అర్థం అయింది. ఆశ్చర్యంతో వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. ప్రియ విషయంలోనేనా యీ ప్రశ్న! 'అట్లాంటిదేమీ లేదండీ' అని ఖచ్చితంగా చెప్పాను సిగ్గుతో తలవంచుకొని. 'నీవు ఎప్పుడూ వెంటనుంటావు గనుక అన్ని విషయాలూ నాతో చెబుతుండాలి' అన్నదామె. ఇదంతా బాధ్యతాయుతురాలైన తల్లిగా ఆమె కనుక్కుంటూ వుండవలసిన వివరాలేమో నాకు తెలియదు....... అప్పట్లో వాళ్ల కుటుంబం విషయంలో నాకర్థంకాని మరో విషయం యిది.

ఇటువంటి విషయాలు కొన్ని నా ముందరే జరిగినప్పటికీ, నాలో కొన్ని ప్రశ్నలు రేకెత్తినప్పటికీ వాటిగురించి ప్రియను ప్రశ్నించలేదు నేను. అట్లా వాళ్ల స్వంత విషయాల గురించి వాళ్లంతట వాళ్లు చెప్తే ఫరవాలేదు గాని బయటివాళ్లు అడగటం ఉచితం కాదనుకున్నాను. రానురాను ఒక్క విషయం స్పష్టమైంది. క్రొత్తవాళ్లముందు పూరికే బయటపడిపోకుండా జాగ్రత్తగానే వున్నా, వాళ్లిద్దరి మధ్యన సుహృద్భావం అనేదిలేదు.

కొన్నాళ్లు గడిచాక ప్రియ నాకు కొంత సన్నిహితురాలైంది. తన కష్టసుఖాల్నీ, తన మనసులో గూడు కట్టుకున్న బాధనూ నాతో చెప్పేది. ప్రియ తల్లిదండ్రులు పిల్లలులేని డాక్టర్ శరభయ్య గారికి ప్రియను పెంచుకోవడానికి యిచ్చారు. ఇది డాక్టరుగారి భార్యకు యిష్టంలేదు. ఆమెకు యిష్టంలేదు గాబట్టి ప్రియను పెంచారు డాక్టరుగారు. ప్రియ మీద ప్రేమకొద్దీగాని పిల్లలుకావాలనే ఆశకొద్దీగాని కాదు. ఆమెమీద కక్షవలననే ప్రియను చదివిస్తున్నారు, డాన్సు నేర్పించారు. అన్ని సౌకర్యాలూ కలిగిస్తున్నారు. ఆమె మాట జరిగివుంటే ఆ యింట్లో ప్రియ కేవలం పనిపిల్లగా వుండేది. ఇంతకూ కారణమైన ప్రియను ఆమె క్షమించలేదు. లోకం దృష్టిలో ప్రియకు తల్లిదండ్రులుగా కనిపిస్తూ ప్రియను చక్కగా పెంచుతున్న వాళ్లిద్దరికీ ప్రియ ఏమీకాదు!— యిది ప్రియమనసులోని బాధ. ఇదంతా యధాతథంగా జరుగుతున్నదా లేక కేవలం ఊహాజనితమా అన్నది నేను నిర్ణయించుకోలేకపోయాను. బహుశా తన స్వంత తల్లిదండ్రులు దగ్గరనుండీ, అక్కడ పొందిన ప్రేమానురాగాలనుండీ వేరైపోవడం ఆ చిన్నతనంలో మనసును తీవ్రంగా గాయపరచి చెరగని ముద్రవేసి వుండాలి అనుకున్నాను. అందుకే ఆ అమ్మాయి మాటల్ని అంతగా పట్టించుకోలేదు. తన బాధలో పాలుపంచుకోలేదు. కష్టాలు మనుష్యులందరికీ వుండేవేనని సర్దిచెప్ప యత్నించాను.

'నేనెంత అభాగ్యురాలినో ఎవరూ ఊహించలేరు, విమలా..... మిమ్మల్నందరినీ చూస్తుంటే నాకు నామీద ఎంతో జాలి కలుగుతుంది. మీ అందరికీ వున్నట్లు మంచి, చెడ్డలన్నింటిలోనూ ప్రేమించగల అమ్మ, కడుపులోదాచుకుని కాపాడగల అమ్మ నాకెందుకు లేదు?......' అంటూ ఏడ్చిందొకనాడు. 'అసలు అమ్మనే ఎరగని వాళ్లూ ఎందరో వున్నారు. వాళ్లంతా నీలాగా బాధపడటంలేదు' అన్నాను. 'అమ్మని ఎరగని వాళ్లు అమ్మని ఊహించుకుంటారు. నాకు

ఏదీలేదు' అన్నది. ఇదంతా కేవలం అనవసరమైన ఆవేశంగా తోచింది నాకు. అమ్మ! అమ్మ! కావలసినవి సమకూర్చుతుంది అమ్మ. అంతేకదా. అన్నీవున్న ప్రియకి యింత ఆరాటం దేనికి? ప్రియ బాధపడుతోంది. నిజమే. తాను బాధపడటం నాకు యిష్టంలేదు. ప్రతివాళ్లూ ఏదో ఒక అసంతృప్తిని ముందు పెట్టుకొని బాధపడుతూ వుంటారు. 'నాకు అన్నీ వున్నై. నేను సుఖంగా వున్నాను' అనుకునే వాళ్లెవరైనా వుంటారా? ఈ ప్రపంచంలోని అనేకమైన విచిత్రాల్లో యిదీ ఒకటి అనుకున్నాను. 'నీ కంటే ఎన్నో విధాలుగా అభాగ్యులైన వాళ్లు అనేకులున్నారు. నీకున్నట్టి అవకాశాలు లేని వాళ్లెందరో వున్నారు' అన్నాను. 'భాగ్యం! అవకాశం!..... నేను చెప్పేది నీవు అర్థంచేసుకోవు! ఈ ప్రపంచంలో డబ్బూ, అందమూ, తెలివీ అనేవే ముఖ్యమైతే నా కన్నీ వున్నట్లే. కాని అది నిజంకాదు..... ఇక్కడుండే సుఖదుఃఖాల్నీ కష్టనిష్ఠూరాల్నీ భరించే శక్తి వాటిల్లోంచి రావడంలేదు! ఆ స్థైర్యం, ఆ జీవశక్తి నాలోలేవు...... బ్రతుకనేది అర్థంలేనిదిగానూ, పెద్ద బరువుగానూ వున్నది నాకు' అన్నది.

.... దురదృష్టకరమైన ఆ రోజును నేను ఎప్పటికీ మరచిపోలేను.సంక్రాంతి సెలవులు పూర్తి వస్తున్నాయి. చలికి దుప్పటి గట్టిగా ముసుగు పెట్టుకొని పడుకున్నాను. బయటి వాతావరణంలోని కరుడు గట్టించే చలినుండీ కాపాడుతూ తల్లి గర్భంలా నన్ను వెచ్చగా కౌగలించుకొని వున్నది దుప్పటి. నన్నావరించిన నిద్రమత్తు హాయిలోంచీ అమ్మమాటలు లీలగా చెవికి సోకాయి. 'ఏయ్, పాపా, ...లే, లే.... మీ దేవప్రియకు ఏమిటో అయిందట....లే, లే'' అంటోంది అమ్మ. గభాల్న లేచి కూర్చున్నాను. నెమ్మదిగా చెప్పింది అమ్మ. 'దేవప్రియ చచ్చిపోయిందట. చాలా గోలగా వున్నది వీధిలో' అన్నది. అప్పుడే తెలతెల్లవారుతోంది. నీలమైన ఆకాశంలోంచి పలచని వెల్తురు వ్యాపిస్తోంది. గేటు దగ్గరకు పరుగెట్టాను. తెల్లటి దట్టమైన పొగమంచు ప్రపంచాన్ని కప్పివేసింది. అల్లంత దూరంలో ప్రియావాళ్ల గులాబీరంగుమేడ పొగమంచు లోంచీ మసగ్గా కన్పిస్తోంది...... ప్రియ చచ్చిపోయిందా. నిజమేనా? ఎందుకు?..... నాకు నమ్మకం కలగలేదు. 'నీవు వెళ్లొద్దు' అంటున్న అమ్మమాటల్ని వెనక్కి తోసేస్తూ ఆ యింటివేపు పరుగెట్టాను.

ప్రత్యేకంగా ప్రియ డాన్సు చెయ్యడానికని నిర్మింపబడ్డ అందమైన హాల్లో నల్లటి పాలరాతి పద్మంమీద అస్తవ్యస్తంగా పడిపోయి వున్నది ప్రియ. చుట్టుప్రక్కల రక్తపు వాంతులు నాలుగైదు మరకలుగా వున్నై. ఆ రక్తం పులుముకుపోయిన ముఖంమీద జుట్టు చిందరవందరగా అతుక్కుపోయి వున్నది. సన్నటి నాజూకైన చేతులమీద నల్లటి చారల్లాంటివి కన్పిస్తున్నాయి. అట్లా పడిపోయివున్న ప్రియను చూస్తే ఏడుపొచ్చింది. గుండెమీద ఏదో బరువు పెట్టినట్లైంది. గట్టిగా ప్రియకు విన్పించేలా పిలవా లనిపించింది.... పిలిచినా ప్రియ యిహ నాతో ఎట్లా మాట్లాడుతుంది? ఇహ కాలేజి క్కూడారాదు నాతో అనుకున్నాను......నిస్సహాయంగా చుట్టూ చూశాను. గదిలో డాక్టరుగారూ ఆయన భార్యతప్పించి ఎవరూలేరు. చూడవచ్చిన వాళ్లంతా బయట గుంపుగా నిలబడి మాట్లాడుకొంటున్నారు. డాక్టరుగారు తనకేమీ సంబంధం లేనట్లుగా నిర్లక్ష్యంగా నిల్చొని కిటికీలోంచీ బయటకు చూస్తూ సిగరెట్లు కాలుస్తున్నారు. దూరంగా కుర్చీలో కూర్చున్న ఆమె ముఖంలో కోపం చీకాకు కన్పిస్తున్నాయి. 'తడి గుడ్డతో మొహం తుడిచి సరిగ్గా పడుకోబెట్టితే బాగుంటుంది' అన్నాను. ఎవరూ మాట్లాడలేదు.

ప్రక్కవీధిలో వుండే శ్రీనివాసరావు మేష్టారూ నాలుగిళ్లవతల వుండే చంద్రయ్యమేష్టారూ కొంతమంది కాలేజీ అబ్బాయిలూ బయటనిలబడి పెద్దగా తర్కిస్తున్నారు.

'చేతిమీద నల్లటి చారలన్నీ వాతల్లాగా వున్నాయే.'

'బాగా కొట్టినట్లున్నారు.....'

'అసలు విషం తనే తీసుకున్నదా? ఎక్కడ దొరికి వుంటుందీ?.'

'ఎంతమంచి పిల్ల! నమ్మలేకుండా వున్నాం.'

వ్యాఖ్యలు అనేకరకాలుగా సాగుతూ కిటికీ లోంచి లోపలకు వస్తున్నాయి. లోకులు పలు గాకులు అనే సామెతను ఋజువు చేస్తున్నాయి.

వంటమనిషి వాళ్లిద్దరికీ టీ తెచ్చింది. టీ తీసుకుంటూ 'వంటిల్లుసర్ది తాళంవేశావా?' అనడిగిందామె. 'త్వరగా బయల్దేరాలి' అన్నారు డాక్టరుగారు.

'ఎక్కడికండీ' అనడిగా నామెను కళ్లు తుడుచుకుంటూ.

'ఈ పిల్లను మ్రెడాసులో వాళ్లమ్మా నాన్నలకు ఒప్పగించాలి' అన్నదామె విసుగ్గా.

'అసలేమైంది? ప్రియ ఎందుకు చచ్చిపోయింది?' అనడిగాను.

'ఎందుకా? పెంచిన నేరానికి మమ్మల్ని రొష్టు పెట్టడానికి..... ఇన్నాళ్లూ యీ పాపిష్టిదానితో వేగినందుకు కొంచెమైనా కృతజ్ఞత లేకుండా ఎం పని చేసిందో చూడు!' అన్నదామె.

ఆమె ప్రియను గురించి మంచిగా మాట్లాడుతుందని ఆశించకపోయినా యీపరిసి తిలో అటూ తిట్టడం నాకు సరిపడలేదు.

'చేతుల మీద ఆ నల్లటి చారలేమిటి?' అన్నాను. ఆమె సమాధానం యిస్తుందన్న నమ్మకం లేదు. ఈ విషయం యిందాకట్నుండీ నా మన్సును తొలుస్తోంది. అందుకని అడిగాను. ఈ విపరీత పరిస్థితుల వలననూ, సానుభూతి చూపే వారెవరూ లేనందుననూ, నా ఎడల దురభిప్రాయం గాని ఎటువంటి అనుమానంగాని లేకుండుట వలననూ ఆమె మనసు విప్పి సమాధానం చెప్పిందనుకుంటాను. "అవా?.. దాని పాడు పనులకు ప్రతిఫలం.. ఈ చావుకీ వాటికీ సంబంధం లేదనుకో.. ఆ పిల్ల గురించి నేను చెప్పినా ఎవరూ నమ్మరు. అంత నంగనాచిలా కన్పిస్తుంది... ఆడపిల్లకు ఒక రాత్రి వేళ యింకోళ్ల యింటికి వెళ్లాల్సిన పనేమిటో చెప్పు.. అందులోనూ మేము ఒద్దన్నప్పుడు రహస్యంగా.. రాత్రి ఆ చంద్రయ్య మేష్టరింటి దగ్గర్నుంచీ వస్తుంటే నేనే చూశాను. దాని సంగతి చిన్నప్పట్నుండీ బాగా తెలిసినదాన్ని గనుక నాకేమీ ఆశ్చర్యం కలగలేదు. అడిగితే పెంకెగా పుస్తకం కోసం వెళ్లాను. నా యిష్టం అన్నది డాక్టరుగారు క్లబ్బు నుండి రాగానే చెప్పాను. తాడుతో కట్టేసి తిక్క ఒదిలేట్లు నాలు గంటించారు.. దానితో యింతకి తెగించింది." అన్నదామె.

ఆమె మాటలు విన్న నాకు నువ్వూ కోసమూ కూడా వచ్చాయి. ప్రియ యింకలేదు. ఆ మధుర మూర్తి, సుశీల యింత దారుణంగా హీనంగా చచ్చిపోవటానికి కారణం యింతహాస్యాస్పదంగా నిస్సారంగా వుంటుందని నాకు నమ్మకం కలుగలేదు! చంద్రయ్య మేష్టరు యాభై ఏళ్ల వయసు గలవారు. భార్యలేదు. కూతురు ఎక్కడో దూరాన వున్నది. ఆయన ఒంటరిగాడు. ఎప్పుడూ ఎవరితోనో పేచీలూ తగవులూ పెట్టుకొని సతమతమాతూ వుండటం ఆయన సరదా అని ఎగతాళి చేస్తుంటారు. ఆయనకీ డాక్టరుగారికీ కూడా ఏదో తగవున్నదట. కాని క్లాసులో లెక్చరరుగా దేవప్రియ మీద అభిమానం చూపుతారు. ఎప్పుడైనా పలకరించి, తెలియనివేవైనావుంటే అడగమని హెచ్చరించి పుస్తకాలు యిస్తుంటారు. 'దూరాన వున్న కూతుర్ని ప్రియలో చూచుకొంటున్నానని' అన్నట్లు ప్రియ ఒకసారి నాతో చెప్పింది.. కేవలం యీమె అపోహ కారణంగా యీఘోరం జరిగిందంటే ఎంత పిచ్చిగా అర్థరహితంగా వున్నది!

'ప్రియ అలాంటిది కాదు. మీరనుకుంటున్నదేమీలేదు. అన్యాయంగా మాట్లాడారు' అన్నాను.

ఆమె కొంచెంసేపు మౌనంగా వుండిపోయింది. ఆమె ముఖం కర్కశంగా వికృతంగా కన్పించింది. కొంచెంసేపుండి నావేపు నిరసనగా చూసి కొంచెం కోపంగా అన్నది: 'అది చాలా మంచిదనీ, దాని గుణాలన్నీ చాలా గొప్పవనీ నీ వనుకుంటున్నావు. అందరూ అనుకుంటారు. అంత బాగా వేషం వేస్తుంది అది కాని దాని గురించి మీకేం తెలుసు?....నాకు తెలుసు. నేను దాన్ని మూడేళ్ల పిల్లగా ఉన్నప్పటినుండి పెంచాను మంచిని చెడ్డగా చెడ్డనిమంచిగా మసిబూసి మారేడుకాయను చెయ్యటం అంత బాగా పట్టుబడని కాలం నుండీ దాన్ని ఎరుగుదును. నీకేం తెలుసు? అడిగావు

కాబట్టి, స్నేహితురాలివి కాబట్టి, యిహ విను....'

ప్రియమీద ద్వేషాన్ని వెళ్ళగక్కుతున్న దామె. ఆమె మాటల్లో విజయగర్వం విన్పిస్తోంది. ఆమె చెప్ప బోయేది నిజమవునో కాదో అన్న ఆలోచన నాకురాలేదు. ఆమె మాటలు వినకుండా తప్పించుకోవాలనుంది. ఈ ద్వేష వలయంలో చిక్కుబడకుండా పారిపోవాలనుంది. ప్రియ నాకు ఆత్మీయురాలు. ఆ అమ్మాయి నవ్వు లోని తియ్యదనం, మాటలోని స్నేహం, అన్నిటినీ మించి ఆ మనసులోని తపన—యివన్నీ నాకు తెలుసు. ఆవిడ కేంతెలుసో ఆవిడఆలోచనలేమిటో నాకెందుకు కాని ఆమె చెప్పుకు పోతోంది.

'ఒక్కోళ్ళకీ పుటకలో ఒచ్చేబుద్ధులనివుంటాయి. ఈ పిల్లవన్నీ నీచపు బుద్ధులు. పువ్వు పుట్ట గానే పరిమళిస్తుందంటారు. ఈ పిల్లది చిన్నప్పట్నుండీ ఉత్త కంపే. మంచి యింట్లో పుడితే మంచి బుద్ధు లుంటాయనుకున్నానుగాని యింత అన్యాయపుదనుకో లేదు. ఇందాక చంద్రయ్య మేష్టరు సంగతి చెప్తే ఏమన్నావూ!.....అయ్యయ్యో ఆ అమ్మాయి అల్లాం టిది కాదండీ అన్నావు. 'అల్లాంటి' పనులు ఆ పిల్ల ఎప్పుడు మొదలెట్టిందో తెలుసా?.....సరిగ్గా అయిదే ళ్లప్పుడు. మొగపిల్లల్తో కూడని పనికిమాలినమాటలు ఆటలూ....ఛీఛీ.....నేను చూసినప్పుడు గొడ్డును బాదినట్లు బాదేశాను. అప్పుడు దాని చెయ్యి విరిగితే ప్లాస్టరు వేశారు కూడానూ.....' ఆమె నవ్వింది, కోడి కెక్కిరించి నట్లుగా.

నాకు నోట మాట రాలేదు. మొద్దులా నిల బడిపోయాను. ఆమె యింకా చెప్పుకు పోతోంది.

'ఈ ఒక్కటే అనుకునేవు. దానికి పుట్టుకతో వచ్చిన యింకో గుణం దొంగతనం. అయితే నాముందు యిట్లాంటి వేవీ సాగనివ్వ ననుకో. ఆ చిన్నతనంలోనే యింట్లో దొంగగా అలమారా పైకెక్కి డబ్బులు తీస్తుంటే ఓసారీ, డాక్టరుగారి జేబులు వెతుకు తుంటే ఓసారీ నేనే పట్టుకున్నాను. ఈ అవగుణాలన్నీ దాని సొంత తల్లికీ అప్పుడే చెప్పాను,ఎందుకైనా మంచి దని. వాళ్లకీ తెలుసు దాని వెధవ బుద్ధులన్నీ. అప్పటి నుంచీ యిప్పటివరకూ అది ఎవరితో మాట్లాడినా ఏం చేసినా ఏ పాడు పని చేస్తుందోనని కాపలా కాసి కాసి విసుగు బుట్టింది. ఇప్పుడిది చచ్చినందుకు నాకు పీడ విరగడైనట్లే వున్నది.''

నా మనసు అల్లకల్లోలం అయిపోయింది. ప్రియ వేపు చూశాను. నలుపు తిరిగి ఉబ్బిన నాలుకా పెదాలూ రక్తపుమరకలూ వాతలూ మొహాన్ని వికృతం చేస్తుంటే 'యీపిల్ల' నిజంగా ప్రియేనా? అన్పించింది. నీలం రంగుకు తిరిగిపోతున్న చేతులూ కాళ్లూ చిన్నపిల్లలకు లాగా మరీ సన్నగా పుల్లల్లాగా వుండి జాలి కలిగిస్తున్నాయి.' ప్రియా, నీవు నిజంగా దొంగవీ, పాపాత్మురాలివీ, పిశాచానివీనా?!' అనుకున్నాను.

ఉన్నట్టుండి నా ఎదురుగా మాట్లాడుతున్న ఆవిడ మీద పట్టరాని అసహ్యం పుట్టుకొచ్చింది. అందరి మంచినీ మన్ననినీ సులువుగా పొందగలిగిన ప్రియను నలిపినాశనంచెయ్యగల యీక్షణం కోసం వెయ్యికళ్లతో ఎదురు చూసినట్లు పైశా చికమైన ఆనందంతో మిడిసిపడుతోంది.నా గుండెలో కోపం మంట లాగా లేచింది. 'పాపం, పుణ్యం గురించి మాట్లాడటానికి నీ వెవరు? ఒక డాక్టర్ని బల వంతంగా బెదిరించి వల్లో వేసుకున్న నర్సువి. పాపం గురించి నీ వెరగవూ? నిన్ను చూస్తేనే అసహ్యం వేస్తుంది' అని అరవా లనిపించింది. బయటకు వచ్చేశాను.

అక్కడున్న అబ్బాయిలూ మేష్టార్లూ నావేపు ప్రశ్నార్థకంగా చూశారు.

'ఆ అమ్మాయిని అన్యాయంగా చంపేశారు. సందేహంలేదు. ఇది హత్య. రాత్రి ఎనిమిది గంటల వేళ మా యింటికి పుస్తకం కోసం వచ్చినప్పుడు బాగానే వున్నది' అన్నారు చంద్రయ్యగారు.

'వాళ్లేమంటున్నారు?' అనడిగారు శేఖరం మాష్టారు. ఈయనకూ ప్రియంటే మంచి అభి మానం వుండేది. ఈయన మా కెమిస్ట్రీ మాష్టారు. అందర్నీ నవ్విస్తూ సరదాగా హాస్యంగా మాట్లాడు తారు.

'ప్రియను మ్రెడాసు తీసుకువెళ్తారట. బయ ల్దేరుతున్నారు' అన్నాను.

నా మాట వినగానే చంద్రయ్య మేష్టారు గాబరాగా లేచారు. 'ఇందులో ఏదో మోసం వున్నది పోలీసు రిపోర్టివ్వాలి.' అంటూ గబగబా వెళ్లిపోయారు.

ఈ మాటలు విన్నారో లేదో గాని ఆయనటు వెళ్లగానే వాళ్లు ప్రియను తెచ్చి కారు వెనుక సీట్లో వేశారు. వాళ్లు ముందు కూర్చుని బయల్దేరి వెళ్లిపోయారు.

కారు వెళ్తుంటే నాకు పట్టరాని దుఃఖం వచ్చింది. 'ప్రియా నన్ను క్షమించు' అనుకున్నాను. ఎందుకో తెలియకుండానే.

ఇంటికి వెళ్లాక జరిగిన దాన్ని గురించి ఎంతో ఆలోచించాను. నా చిన్ననాటి జ్ఞాపకం ఒకటి స్మృతి పథంలోకి వచ్చింది. ఒకరోజున షాపులో ఒక దంతపు పైట పిన్ను చూశాను. నాకు పదేళ్లు కూడా వుండవు అప్పుడు. ఆ పిన్ను మీద చాలా యిష్టం కలిగింది. అమ్మావాళ్లు కొనివ్వరు. నాన్నగారి జేబులోంచీ రెండు రూపా యిలు తీసుకున్నాను. పిన్నుకొని చొక్కాకు పెట్టు కొని మహదానందంతో వూరంతా తిరిగి సాయంత్రం భోజనాలవేళకుముందుగా యింటి కొచ్చాను. రాగానే అమ్మ ఆ పిన్నును చూసింది. ఎక్కడిదని అడిగింది. కొట్టువాడు వూరికేనే యిచ్చాడని, చెప్పాను. కాని అమ్మ అసలు విషయం పసి కట్టేసింది. నాన్నగారు రాగానే చెప్పింది. 'చెప్పకుండా యింట్లో డబ్బులు ఎత్తుకు పోతావా' అంటూ అయిదు వేళ్లూ ముద్ర పడేట్లుగా వీపు మీద ఒకటి వేశారు, అంతే. తరువాత నేను దొంగనని గానీ నాది దొంగబుద్ధి అని కానీ ఎవరూ నిర్ధారించ లేదు.. నేను దొంగనా? కాదా?... కాదని నాకు తెలుసు. నేను చేసింది దొంగతనంకాదు. మనసారా ఆశించిన దాన్ని కొనుక్కోవటం.. నేనూ ఒకప్పుడు అయిదేళ్ల పిల్లగా వున్నాను. ఆ వయసు పిల్లలు ఆడే ఆటలూ కౌతూహలంతో తెలుసుకునే, విషయాలూ నాకూ కొంతవరకు తెలుసు. జీవ శాస్త్ర సంబంధమైన విషయాలు ఇతర దేశాల్లో వాళ్ల తలిదండ్రులూ టీచర్లూ చెప్తారట. ఇక్కడెవరూ చెప్పరు. తెలిసిన అయిదారేళ్ల పండి తుల దగ్గర తెలియని అయిదారేళ్ల పిల్లలు తెలుసుకుంటారు. తెలుసుకునే పద్ధతుల్లో భేదం వుండొచ్చు. ఆ కుతూహలమే పాపమూ, అమాయక మైన ఆశే దొంగబుద్ధీ అంటే ..పాపం, పుణ్యం అన్నీ మనిషిలోని జీవశక్తికి మారుపేర్లు.

పాపం అనేది ఒకమాట.

పుణ్యం అనేది యింకో మాట.

మనిషిలోని దుష్టత్వం మాటల్ని ఆయు ధాలుగా చేసుకొని అవతలి మనిషిని హింసిస్తున్నది.

Judge not others! Judge not others!!

పాపం పుణ్యం అనేవి మనిషి కంటే గొప్పవి కావు.

మనిషి చేసిన మాటలో మనిషే చిక్కుబడి పోతున్నాడు.. ఆ జీవశక్తి యితరుల్ని హింసించకుంటే చాలు. మనిషికి యింకే ధర్మమూ అక్కర్లేదు.

ఆనాటి యీ విషయాల్ని సాకుగా చేసుకొని తన మనసులోని మురికిని ప్రతినిముషమూ ప్రియకు పులుముతూ ప్రియ ప్రతిచేష్టనూ అనుమానిస్తూ అవమానిస్తూ హింసిస్తూ బ్రతు కునే నరకంగా చేసింది ఆమె.

'నాకు అమ్మ లేదు' అంటూ ప్రియ బాధ పడింది ఇందుకన్న మాట!

నాతో యివన్నీ ఎందుకు చెప్పలేదు ప్రియ? అర్థం చేసుకోలే ననుకున్నదా? తన నోటితో యిటు వంటి మాటలు చెప్పలేక పోయిందా?

చెప్పి వుంటే యిద్దరం కలిసి కూర్చొని అవిణ్ణిచూసీ ప్రపంచాన్నిచూసీ హాయిగా నవ్వుకొని వుండేవాళ్లం.

ప్రియ బ్రతికి వుండేది.

ఇక్కడి పోలీసుల రిపోర్టు మీద మద్రాసు పోలీసులు మద్రాసు సమీపంలో వాళ్ల కారును

ఆపివేశారనీ, ఆ పిల్ల తల్లిదండ్రుల దగ్గరకు తీసుకు వెళ్తున్నట్లు తెలిసి వెళ్లనిచ్చారనీ, పోస్ట్‌మార్టెమ్‌లో అది గుండెఆగి చనిపోవటంగా తేల్చారనీ తెలిసింది.

తరువాత చాలా విషయాలు జరిగాయి. డాక్టరుగారు చంద్రయ్యమేష్టారి మీద పగబట్టారు. తన కుమార్తెతో అక్రమ సంబంధం కలిగి వుండి ఆ అమ్మాయి చావుకు కారకుడయ్యాడనీ, తన మీద అబద్ధపు పోలీసు రిపోర్టు యిచ్చాడనీ లక్ష రూపాయిలకు పరువునష్టందావా వేశారు. చంద్రయ్య మేష్టారు వూరుకోదలచలేదు. డాక్టరుగా పూర్వం ఆయన చేసిన తప్పులూ, ఆయన క్రూర స్వభావం కోర్టులో సోదాహరణంగా నిరూపించటానికీ, ప్రియ మరణానికీ ఆయన కొట్టిన దెబ్బలకీ వున్న సంబంధం స్పష్టం చెయ్యటానికీ పూనుకున్నారు. ఆ యుద్ధం యిలా వుండగా చంద్రయ్య మేష్టారి విషయమంతా అబద్ధమనీ, నిజంగా దేవప్రియ తననే ప్రేమించి ఆరాధించి తన కొరకే చనిపోయిందని చాలా మందితో చెప్పుకున్నారు శేఖరంగారు.

అనేకమైన స్వార్థాల ఆట యీ ప్రపంచపు పోకడ. ప్రియకు యిక్కడ స్థానంలేదు. ఒక్క అపవాదుగా దుష్టమైనకథగామారి మాయమై పోయింది దేవప్రియ.

